క్లుప్తంగా

వై ఏపీ నీడ్స్ జగన్ నేడు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక 20వ డివిజన్ ఇరువారం సచివాలయ పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటివద్దే మెరుగైన వైద్యం


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని 197రామాపురం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలందించారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సరస్వతి, దివ్య, శశి, శివగామి పాల్గొన్నారు.

నెలాఖరులోపు పన్ను చెల్లించండి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరం సంబంధించి 2వ అర్ధ సంవత్సరం పన్నులను అపరాధ రుసుం లేకుండా చెల్లించడానికి మరో నాలుగు రోజులే సమయం ఉందని నగర కమిషనర్ అరుణ చెప్పారు. డిసెంబర్ 31వ తేదీ లోగా 2023–24 ఆర్థిక సంవత్సరం పన్నులను చెల్లించి అపరాధ రుసుం నుంచి మినహాయింపు పొందాలన్నారు. డిసెంబర్ 31వ తేదీ తర్వాత పన్ను చెల్లించేవారు 12 నెలల వడ్డీతో కలిపి పన్ను చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్ను బకాయిదారులు సత్వరం పన్ను చెల్లించాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించడం ద్వారా నగరపాలక సమగ్రాభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందించాలని కోరారు.

సెలవు పెడితే రిజిస్టర్‌లో నమోదు చేయరా?


ఎంపీడీవో కార్యాలయంలో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: సెలవుల రిజిస్టర్‌లో సిబ్బంది సీఎల్ కూడా నమోదు చేయక పోయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని ఎంపీడీవో విద్యాసాగర్‌పై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో చాలామంది సిబ్బంది విధులకు హాజరుకాలేదు. అటెండెన్స్ రిజిస్టర్‌లో కూడా సెలవు నమోదు కాలేదు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మండలస్థాయి పరిపాలనలో కీలకమైన ఎంపీడీవో ఇంత నిర్లక్ష్యంగా ఉంటే పాలన ఎలా ఉంటుందో బాగా అర్థమవుతోందని అసహనం వ్యక్తం చేశారు. ఇంకోసారి ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా అందుకు ఎంపీడీవోనే బాధ్యత వహించాల్సి ఉంటుందని, చర్యలు తప్పవని హెచ్చరించారు. జెడ్పీ చైర్మన్ ప్రశ్నలకు ఎంపీడీవో సరైన సమాధానాలివ్వకుండా నీళ్లు నమలడం గమనార్హం.

వైభవంగా ఆరుద్ర ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో చంద్రమౌళీశ్వరస్వామి

నగరి : పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో, కీళపట్టు చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆరుద్ర పూజలు వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేసి, పలురకాల హారతులు ఇచ్చారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తులను కూడా సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.


కరకంఠేశ్వర ఆలయంలో ఊరేగింపు

బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రికెట్ పోటీలు


బంగారుపాళెం: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు


ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా


ఐరాల: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీపీఓ లక్ష్మి

బంగారుపాళెం: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గ్రామ సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పోటీలు సజావుగా సాగుతున్నాయి. మండల స్థాయిలో పోటీలలో సత్తాచాటి నియోజకవర్గ స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఉత్సాహం చూపుతున్నారు. మండల స్థాయి అధికారులు క్రీడాపోటీలను పర్యవేక్షిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి

ఐరాల: ఆడుదాం–ఆంధ్రాను గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు డీపీఓ లక్ష్మీ కోరారు. మండలంలోని కాణిపాకం ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించారు. అంతకుముందు ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమం ద్వారా పలు క్రీడలను నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం కబడ్డీ పోటీలను ఆమె తిలకించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ధనం చంద్రా రెడ్డి, ఈఓపీఆర్‌డీ కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి శ్యామల పాల్గొన్నారు.

పకడ్బందీగా క్రీడా పోటీలు

పూతలపట్టు: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను పీడీలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ తెలిపారు. మండలంలో బుధవారం మద్దులయ్యగారిపల్లి, పూతలపట్టు క్రీడామైదానంలో క్రీడాపోటీలను పరిశీలించారు. సచివాలయాల పరిధిలో జరిగిన పోటీల్లో విజేతలను జాగ్రత్తగా ఎంపిక చేయాలని పీడీలకు సూచించారు. ఐదు క్రీడలను తప్పనిసరిగా క్రీడాకారులు నిర్వహించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, పీడీలపై ఉందని తెలిపారు. అనంతరం తొలి క్రీడను ఎంపీడీఓ గౌరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, ఎంఈఓ 2– కోటీశ్వరయ్య, సర్పంచ్ మణి, కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్ వల్లి, పంచాయతీ కార్యదర్శులు, పీడీలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోత్సాహం

తవణంపల్లె: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతోందని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. మండలంలోని చెర్లోపల్లె, అరగొండ, పైమాఘం, మత్యం, తవణంపల్లె హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం వ్యాయామ ఉపాధ్యాయులు బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలను పురుషులు, మహిళల విభాగంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పీడీలు వేణుగోపాల్, శ్రీనివాసులు, అరుణ్‌కుమార్, అరుణ, క్రీడాకారులు పాల్గొన్నారు.



పూతలపట్టు: పంచాయతీ కార్యదర్శులు, పీడీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి, తవణంపల్లె హైస్కూల్లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

కార్మికుల హాజరు నమోదు తనిఖీ


తనిఖీలో కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో కొంగారెడ్డిపల్లి మస్టర్ కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికుల హాజరును నగర కమిషనర్ అరుణ బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మస్టర్ కేంద్రంలో 6, 9, 10, 11 వార్డులకు సంబంధించిన పారిశుద్ధ్య కార్మికుల హాజరు నమోదు, విధులకు హాజరైన పారిశుద్ధ్య కార్మికులు, రిజిస్టర్లో నమోదైన వివరాలను తనిఖీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. సీడీఎంఏ ఆదేశాల మేరకు మస్టర్ కేంద్రాల వద్ద కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై అధికారులు, వార్డు పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శులతో సమీక్షించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. ప్రధాన రహదారులు, వీధులు శుభ్రంగా ఉంచాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా జరగాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా. లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

గర్భిణి సేవలపై అవగాహన

చిత్తూరు రూరల్: గర్భిణి సేవలపై అవగాహన కల్పించి వారు సద్వినియోగం చేసుకునేలా డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆమె పీహెచ్‌సీ సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గర్భిణి సేవల్లో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. వారిని సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందేలా చూడాలని చెప్పారు. తల్లీబిడ్డ వాహనాలను సద్వినియోగం చేసుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. తల్లీబిడ్డపై నిత్యం పర్యవేక్షణలో ఉంచాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐఓ రవిరాజు, అధికారులు అనిల్, జార్జ్, గుణశేఖర్, రేణుక ప్రభ, డీపీఓ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద గురువారం ఉదయం నిర్వహించే విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఈ శ్రీనివాసమూర్తి కోరారు. బుధవారం ఏడీ కార్యాలయంలో ఆయన విద్యుత్ అదాలత్ కరపత్రాలను డివిజన్‌లోని ఏఈలతో కలసి ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమ ఏర్పాట్లపై ఏడీ చిన్నబ్బతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ చైర్మెన్‌గా శ్రీనివాస ఆంజినేయ మూర్తి, ఆర్థిక సభ్యుడు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్, వినియోగదారుల సంఘం సభ్యురాలు ఈశ్వరమ్మ హాజరై వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

నేడు ఎఫ్‌సీఐ ఈడీ రాక

పలమనేరు: పలమనేరు మండలంలోని మొరం గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటనకు గురువారం ఉదయం 9 గంటలకు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సచీంద్రకుమార్ పట్నాయక్ రానున్నట్టు కార్యక్రమ లైజన్‌ఆఫీసర్ మహ్మద్ రఫీ తెలిపారు. వికసిత్ భారత్ యాత్రను ఆయన పరిశీలిస్తారు, లబ్ధిదారులతో మాట్లాడుతారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ గంగాభవాని

బంగారుపాళెం: ఉపాధిహామీ పనుల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బుధవారం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2022–23 ఆర్థిక సంవత్సరానికి మండలంలో జరిగిన పనులపై సామాజిక ప్రజా వేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. ఆమె మాట్లాడుతూ, మండలంలో 2,709 పనులకు గాను రూ.6.77 కోట్లు, పంచాయతీరాజ్ కింద 48 పనులకు సంబంధించి 3 కోట్ల 90 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు చెప్పారు. పంచాయతీ రాజ్‌లో నాలుగు పనులకు సంబంధించి రికార్డులు ఇవ్వలేదన్నారు. హౌసింగ్‌లో కూలీలకు రూ.27 వేలు అదనంగా చెల్లించారని ఆ డబ్బులను రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ సోమశేఖర్, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ అహ్మద్, విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, ఏపీడీ నీలిమ, ఎంపీడీఓ హరికృష్ణారెడ్డి, పీఆర్ఏఈ గురువారెడ్డి, ఏపీఓ కిరణ్‌కుమార్, ఈసీ గణేష్, ఉపాధి టెక్నికల్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పూతలపట్టులో వాహనాల వేలం

పూతలపట్టు: మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించాల్సిన వాహనాల వేలం గురువారానికి వాయిదా వేసినట్లు ఎస్ఐ రాంభూపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం రవాణా కేసుల్లో సీజ్ చేసిన ఓమ్నీ వ్యాన్, ప్యాసింజర్ ఆటోను వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 10.30 గంటల సమయంలో పూతలపట్టు పోలీస్‌స్టేషన్ ఆవరణకు చేరుకోవాలని సూచించారు.

చుక్కలు చూపిస్తున్న కేఎస్ ఆర్టీసీ



పలమనేరు పట్టణానికి వచ్చే ప్రయాణికులపై కర్ణాటక ఆర్టీసీ కండక్టర్లు నిర్లక్ష్యం చూపుతున్నారు. తిరుపతి– బెంగళూరు బస్సుల్లో పలమనేరు ప్రయాణికులను ఎక్కించుకోవడం లేదు. అటు బెంగళూరు– తిరుపతి బస్సుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. డైరెక్ట్ టిక్కెట్లు ఖాళీగా ఉంటే మాత్రం పలమనేరు ప్యాసింజర్లను ఎక్కించుకోవడం, డైరెక్ట్ టిక్కెట్లు ఉంటే బైపాస్‌లో వెళుతున్నారు. పలమనేరు డిపో నుంచి ఒక్క బస్సు కూడా బెంగళూరు– తిరుపతికి లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

- తిరుపతి నుంచి పలమనేరుకు అనుమతించని వైనం
- బెంగళూరు నుంచి ఇక్కడికి రావాలన్నా ఇదే పరిస్థితి
- డైరెక్ట్ టికెట్లు లేకుంటే మాత్రం పలమనేరులోకి ఎంట్రీ

పలమనేరు : తిరుపతి నుంచి నిత్యం పలమనేరుకు, బెంగళూరు నుంచి పలమనేరుకు వేల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. నిత్యం బెంగళూరులో పనులు చేసి వచ్చేవారు, వారాంతపు సెలవుల్లో ఇక్కడికి వచ్చేవారు ఉన్నారు. ఈ మార్గంలో పలు ఏపీ హైటెక్ బస్సులు పలమనేరు పట్టణంలోకి రాకుండా బైపాస్‌లో వెళుతున్నాయి. పట్టణంలోకి వచ్చే సర్వీసులు చాలా తక్కువ. కర్ణాటక ఆర్టీసీకి చెందిన వంద బస్సులు ఈ మార్గంలో నిత్యం నడుస్తున్నాయి. ఇందులో పర్మిట్ కూడా లేని బస్సులు సగానికిపైగానే ఉన్నట్టు ఆర్‌టీవో అధికారులకు సైతం తెలిసిన విషయమే. వీటిపై స్థానిక అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అంతుచిక్కడం లేదు. తిరుపతి బస్టాండులో కర్ణాటక బెంగళూరులో బస్సులో కండక్టర్లు సీట్లు ఖాళీ ఉన్నా పలమనేరు ప్రయాణికులను ఎక్కించుకోవడం లేదు. నాన్ స్టాప్ బెంగళూరంటూ డైరెక్ట్ టిక్కెట్లను మాత్రం ఎక్కించుకుంటున్నారు. దీంతో పలమనేరుకు వెళ్లాలంటే చాలా కష్టంగా మారుతోంది. అదే బెంగళూరు ప్రయాణికులు తక్కువగా ఉంటే మాత్రం ఎక్కించుకుంటున్నారు. ఇదే పరిస్థితి బెంగళూరు నుంచి పలమనేరుకు రావాలన్నా నెలకొంది. స్థానిక ఆర్టీసీ అధికారులు సైతం ఈ సమస్యను ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ సమస్యపై పట్టణవాసులు పలు మార్లు స్థానిక డీఎంలకు వినతిపత్రాలనందించారు. కనీసం పలమనేరు నుంచైనా బెంగళూరుకు బస్సులు నడపాలని కోరినా ప్రయోజనం లేకుండా పోతోంది.

ఎన్ని అగచాట్లో



రెండు రోజుల కిందట తిరుపతి నుంచి పలమనేరుకు బయలుదేరా. కేఎస్ ఆర్టీసీ బస్సుల వద్దకు వెళ్లి కండక్టర్లను అడిగా పలమనేరంటే వాళ్లు ఎక్కించుకోలేదు. వారికి టికెట్లు లేనప్పుడు మాత్రం పలమనేరుకొచ్చే కర్ణాటక బస్సులను పట్టణంలోకి రానివ్వకుండా ఆపేస్తేగానీ వారిలో మార్పు రాదేమో.

– నవీన్‌కుమార్, పలమనేరు

ఏళ్లుగా ఇదే సమస్య



పలమనేరుకు రావాలంటే బెంగళూరు నుంచి ఎక్కించుకోరు, తిరుపతి నుంచి రావాలన్నా ఎక్కనివ్వరు. దీనిపై మేము పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించాం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. పోనీ ఇక్కడి డిపోనుంచైనా బెంగళూరు–తిరుపతి సర్వీసులను నడపమన్నా నడపరు. దీనిపై ఆందోళన చేస్తాం.

– నరసింహులు, కార్యదర్శి, పీపీఎస్

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి


సామాజిక తనిఖీ బహిరంగ సభలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

తవణంపల్లె: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టేందుకు కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ గంగాభవాని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనుల సామాజిక తనిఖీపై బహిరంగ సభ నిర్వహించారు. బహిరంగ సభలో పీడీ గంగాభవాని మాట్లాడుతూ మండలంలో 1,496 ఉపాధి పనులకు రూ.4,16,15,084 ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు చెందిన 26 పనులకు రూ.1,94,86,444, ఒక ఆర్‌డబ్ల్యూయస్ పనికి రూ.1.08,417 వ్యయం చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్ 2022 ఆర్థిక సంవత్సరం నుంచి మార్చి 2023 వరకు జరిగిన పనులను తనిఖీ చేసినట్లు వివరించారు. మండలంలోని 32 పంచాయతీల్లో జరిగిన పనులకు సంబంధించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో కారకాంపల్లె, ఎ.గొల్లపల్లె, సరకల్లు పంచాయితీల్లో హౌసింగ్ బిల్లుల అవకతవకలు జరగడంతో రూ.14,831 రికవరీకి ఆదేశించారు. తొడతర, సరకల్లు, కారకాంపల్లె ఫీల్డు అసిస్టెంట్లు రికార్డులు సక్రమంగా సకాలంలో సమర్పించలేదని ముగ్గురికి రూ.1700 అపరాధం విధించారు. బహిరంగ సభకు డీవీఓ భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఎస్‌ఆర్‌పీలు మీరావల్లి, నాగేంద్రబాబు, ఏపీఓ లలిత, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి అందే విధంగా చూడాలని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఇందులో ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై మండల మీట్‌లో అధికారులకు తెలియజేశారు. దీంతో అధికారులు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇంటి పట్టాలు కావాల్సిన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రేషన్ కార్డులు ఇకపై ఆరునెలలకోసారి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, సచివాలయాల నిర్మాణాలను వెంటనే చేపట్టాలన్నారు. జగనన్న చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసినట్లయితే సమస్యలను పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం గ్రామాల్లోని ప్రజల్లో బాగా స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు రజినీకాంత్, మోహన్, పెరిల్లా, జయకోడి, గుణవతి, ఎంపీటీసీలు యోవాన్, గ్లోరీతో పాటు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి డివిజన్‌లో సంక్షేమం


వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి డివిజన్‌లో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక 37వ డివిజన్‌లో బుధవారం చర్చివీధి సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం సంక్షేమ బోర్డును, కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. డివిజన్‌లో రూ.10.91 కోట్లు ఇంత వరకు ఖర్చు చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, నగర సచివాలయ కన్వీనర్ కిరణ్, కార్పొరేటర్ నిర్మల నాయకులు రవి, వేణు, బషీర్, ఎస్‌కే బాయ్ పాల్గొన్నారు.

చిత్తూరు ఐసీడీఎస్‌కు మార్పు చేయండి


ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు సమస్యలు వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

యాదమరి: మండలంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు చిత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులోకి మార్పు చేయాలని మండల అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు విన్నవించారు. మండల అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం ఉదయం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ మండల ఐసీడీఎస్ ప్రాజెక్టు గతంలో చిత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఉండేదన్నారు. ఆరు నెలల క్రితం బంగారుపాళెం ఐసీడీఎస్ ప్రాజెక్టులోకి మార్పు చేశారన్నారు. బంగారుపాళ్యం వద్దని, చిత్తూరులోకి మార్పు చేయాలని విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షులు మమత, తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర పోస్టర్ల ఆవిష్కరణ


గుడిపాల: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

గుడిపాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన సంవత్సర పోస్టర్లను బుధవారం మండల పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మధుసూదన్ రాయల్, గోళ్ల హరిప్రసాద్, మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సరం, సంక్రాంతి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, గోపి, నవీన్, రవియాదవ్, కృష్ణమూర్తి, సెల్వం, దినేష్, బాషా పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో పార్కింగ్ పరేషాన్!


ఓపీ విభాగం వద్ద

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పార్కింగ్ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రతి విభాగం ముందు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అత్యవసర విభాగానికి ముందు రోడ్డుకు ఇరువైపులా వాహనాలను నిలిపేస్తున్నారు. ప్రసూతి విభాగం ముందు భాగం, ఓపీ, ఎంఎస్ వార్డు ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ చుట్టుముట్టేస్తున్నాయి. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా అత్యవసర విభాగం ముందు వైపు 108 వాహనం రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయాన్ని 108 సిబ్బంది అధికారులు, సెక్యూరిటీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు. సెక్యూరిటీ సిబ్బంది వాహనాల పార్కింగ్ విషయంలో ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ఆస్పత్రిలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నట్లు రోగులు చెబుతున్నారు. ఒక కొన్ని విభాగాలకు అడ్డదిడ్డంగా దారాలు కట్టేశారు. ఈ కారణంగా అత్యవసర సమయాల్లో రోగులకు అవస్థలు తప్పడం లేదు. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ తనిఖీ నేపథ్యంలో వాహనాల పార్కింగ్‌పై ఉన్న శ్రద్ధ మళ్లీ ఎందుకు మానుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


ఎం.ఎస్ వార్డు ఎదురుగా విచ్చలవిడిగా పార్కింగ్